క్లుప్తంగా

రేపు నిరుద్యోగులకు ఉపాధి మేళా

సంగెం: మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఈజీఎంఎం శాఖ ద్వారా శ్రీ టెక్నాలజీ వరంగల్ ఆధ్వర్యంలో శిక్షణ, ఉపాధి మేళా నిర్వహిస్తున్నట్లు దీన్‌దయల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్‌యోజన ప్రతినిధి బి.రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేర్‌హౌస్ అసోసియేటెడ్ కోర్సులతో పాటు కంప్యూటర్ ట్రైనింగ్ అండ్ స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వబడునన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి యూనిఫాం, రూ 3వేల ఉపకార వేతనంతో పాటు కేంద్ర ప్రభుత్వంచే ధ్రువీకరించబడిన సర్టిఫికెట్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎంఎం సర్టిఫికెట్ అందించబడుతాయన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పించబడుతుందన్నారు. వివరాలకు 9849131050, 9642141539 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాసిరకం విత్తనాలు అమ్మే షాపులపై చర్య తీసుకోవాలి


ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న కుమారస్వామి

నర్సంపేట : నాసిరకం విత్తానాలు అమ్మే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అవినీతి నిర్మూలన సంస్థ వ్యవస్థాపకుడు పుల్లూరి కుమారస్వామి అన్నారు. ఈ సందర్భంగా నర్సంపేట ఏసీపీ పున్నం రవీందర్‌రెడ్డికి వినతిపత్రం శనివారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని సామాన్య ప్రజలను, రైతులను దళారీలు పెద్ద ఎత్తున దోచుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

నర్సంపేట : తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్, కేంద్ర కార్మికుల చట్టం హక్కుల కోసం ఈనెల 18 న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని డీబీఆర్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇమ్మడి బాబు అన్నారు. పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని జరుగుతున్న పలు అంశాలపై ప్రజా సంఘాల రౌండ్ టే బు ల్ సమావేశాన్ని నిర్వహించనున్నామని తెలిపారు.

‘బిట్స్’లో ప్లేస్‌మెంట్ డే వేడుకలు

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశలో నేర్చుకున్న విజ్ఞానాన్ని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగడానికి, ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవడానికి వినియోగించాలన్నారు. ఈ విద్యా సంవత్సరానికి సుమారు 450 మంది విద్యార్థులు పలు కంపెనీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ జి.రాజేశ్వర్‌రెడ్డి, బిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, ముఖ్య ప్రాంగణ నియామకపు అధికారి సురేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధిపతి ఫణీ అహ్మద్ ఫర్వేజ్, అకాడమిక్ కోఆర్డినేటర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నిక



అధ్యక్షకార్యదర్శులు శివకుమార్, వీరన్న

నెక్కొండ : ఆర్యవైశ్య సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోరంట్ల వెంకట్‌నారాయణ, జిల్లా కా ర్యదర్శి దేసు లక్ష్మణ్ తెలిపారు. స్థానిక వాసవి కల్యాణ మండపంలో శనివారం సంఘం స మావేశంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటిపల్లి శివకుమార్, ప్రధానకార్యదర్శిగా భూపతి వీరన్న, ఉపాధ్యక్షులుగా వెంశెట్టి శ్రీహరి, కిరణ్, సహాయ కార్యదర్శిగా బొల్లం యాకయ్య, కోశాధికారిగా ఇమ్మడి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా వేములపల్లి వీరన్న, బెలిదే రమేశ్, సమ్మయ్య, చిదురాల నరేశ్, గాందె కృష్ణమూర్తి ఎన్నికయ్యారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. కమిటీ ఎన్నికకు సహకరించిన అందరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘం సీనియర్ నాయకులు మారం రాము, తాళ్లూరి వెంకటేశ్వర్లు, నంగునూరి శివయ్య, గన్ను సత్యం, తాళ్లూరి నర్సింహస్వామి, దొడ్డ విజయ్‌కుమార్, గన్ను రాము, బొల్లం పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు.. నిఘానేత్రాలు

- గ్రామాల్లోనూ పోలీసుల పర్యవేక్షణ
- దాతలు, గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు
- పల్లెల్లో తగ్గుతున్న నేరాలు


పోలీస్ స్టేషన్‌కు అనుసంధానమైన మానిటర్


అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

నెక్కొండ : నేరాల నియంత్రణకు పోలీసులు పట్టణాలతో పాటు గ్రామాల్లోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో నేరాలు, అక్రమాలకు అడ్డుకట్ట పడుతోంది. పోలీసులు ఆయా గ్రామస్తులు, వ్యాపారులతో చర్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఎక్కడ ఏ సంఘటన జరిగినా వెంటనే వాస్తవాలు తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు పోలీసులకు సాయమందిస్తుండడంతో అనుమానిత వ్యక్తులను ఇట్టే పట్టేస్తున్నారు. ఇప్పటికే పలు దొంగతనాలు, కిడ్నాప్ కేసుల్లో సీసీ కెమెరాల సా యంతో పోలీసులు కేసులను సులువుగా ఛేదించారు.

ప్రతీ గ్రామపంచాయతీలో నిఘా...

మండలంలోని ప్రతీ గ్రామపంచాయతీలో సీసీ నిఘాలో ఉండేలా పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే మండలంలో చాలా గ్రామాల్లో ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎక్కువ మొత్తంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పంచాయతీల వారీగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నెక్కొండలో ప్రతీ ప్రధాన రోడ్ల, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామంలో 7 నుంచి 10 వరకు కెమెరాలతో నిఘా పెంచేందుకు కృషి చేస్తున్నారు. మండల పరిధిలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో నిఘా నేత్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని పోలీసులు కోరుతున్నారు.

ఇక...కంటినిండా కునుకు

గ్రామాల్లో దొంగతనాలు, దోపిడీలు, అల్లర్లు ఏమి జరిగినా సీసీ కెమెరాలతో కనిపెట్టొచ్చు. మండల వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుతో కంటి నిండా కునుకు తీయవచ్చని ప్రజలు సంతోషం వ్యక్త చేస్తున్నారు.


ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్నాం



పోలీస్ శాఖ సలహాలు, సూచనల మేరకు గ్రా మంలో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో ఏర్పాటుకు అటు గ్రామస్తులు.. ఇటు వ్యాపారులు ముందుకు రావడం సంతోషకరం. ఇప్పటి వరకు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

– రాంపెల్లి శ్రావణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అలంకానిపేట

నేరాలు తగ్గుముఖం పట్టాయి



అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాలు తగ్గుముఖం పట్టాయి. ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో పాటు వీటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం. సీసీ కెమెరాల ఏర్పాట్లకు దాతలు ముందుకు రావడం హర్షనీయం.

– మహేందర్, ఎస్సై, నెక్కొండ

మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు


పశువులకు మందు వేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య

వర్ధన్నపేట : ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని రామారంలో రైతులకు శనివారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ మార్కెట్ పరిధిలో ఐనవోలు, రాయపర్తి, వర్ధన్నపేట మండలాలు ఉండగా పశువైద్యానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని గమనించి ఆయా మండలాల్లో ఒకరోజు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందులో భాగంగా రామారం గ్రామంలో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా నాయకులు పోశాల వెంకన్న, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాసరాజు, సభ్యులు మాలతి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మండల సమాఖ్య కార్యవర్గం



నల్లబెల్లి : ఇటీవల నూతనంగా ఎన్నికైన నల్లబెల్లి మదర్ థెరిస్సా మండల సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.. మహిళ సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సమాఖ్య అధ్యక్షురాలు జంగిలి మమత కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్యదర్శి ఈర్ల స్వప్న, కోశాధికారి ముత్యాల మానిక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రె డ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, శేఖర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేష్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సఖి సెంటర్ నిర్వహకులు నూర్జహాన్

పర్వతగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సఖి సెంటర్ సైకో సోషల్ కౌన్సెలర్ నూర్జహాన్ అన్నారు. మండలంలోని బూర్గుమళ్ల, అన్నారం షరీఫ్ గ్రామాల్లో శనివారం వీఓల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడుతూ మహిళా శిశు, దివ్యాంగ, వయోవద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి సెంటర్లు పని చేస్తున్నాయన్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులకు అందిస్తున్న సేవలను ఆమె వివరించారు. బాధితులకు కౌన్సిలింగ్ పోలీస్, న్యాయ సహాయం, వైద్యం, తాత్కాలిక వసతి సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని ఆమె పేర్కొన్నారు. బాధితులు టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో వర్కర్ స్వప్న, వీఓఏ జ్యోత్స్న, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం


ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న గోపాల్‌నాయక్

నర్సంపేట : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ అన్నారు. చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో లచ్చినాయక్‌తండా, కట్టయ్యపల్లెలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, మాజీ సర్పంచ్ తూటి పావనిరమేష్, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వీరన్ననాయక్, భూక్య సురేష్, బాదావత్ వీరు, బాదావత్ పెద్ద వీరు, గంట వీరన్న, భూక్య భీమానాయక్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట : తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశాలకు ఎంపికను నిర్వహిస్తున్నట్లు చెన్నారావుపేట ఎంఈఓ బైరి సరళ అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 18న బుధవారం 9 గంటలకు జిల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి నాల్గో తరగతిలో ప్రవేశాలకు చెన్నారావుపేట ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి సెలక్షన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ గుగులోతు భిక్షపతి నాయక్ పాల్గొన్నారు.

వర్ధన్నపేట: నాల్గో తరగతిలో ప్రవేశాలు పొందుటకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి మామునూరు శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎంపికకు మండలంలోని కట్య్రాల జెడ్పీహెచ్ఎస్‌కు ఉదయం 9.30 గంటలకు గైడ్ టీచర్‌తో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ సోమన్నను సెల్ నంబర్ 9441454178లో సంప్రదించాలని కోరారు.

దుగ్గొండి : తెలంగాణ క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం మండల పరిధిలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 18న క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పర్వతగిరి : క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు జరుగుతున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి లింగారెడ్డి అన్నారు. వివరాలకు ఎమ్మార్సీ సీసీఓ జయరాజ్ 9494790103 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

నల్లబెల్లి : క్రీడాపాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి 4వ తరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ అనురాధ తెలిపారు. ఈ నెల 18న రుద్రగూడెం కాకతీయ బ్రిలియంట్ స్టార్ హైస్కూల్ ఆవరణలో శరీరక సామార్థ్యానికి సంబంధించి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు

నర్సంపేట : ఐదేళ్లలోపు పిల్లలందరినీ తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఉప్పరపల్లి అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి అన్నారు. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లిలో శనివారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పిల్లలు, తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి పిల్లలకు అక్షరాభ్యాసం చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రజిత, సరోజన, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

స్థలం విషయంలో ఇరువర్గాల తోపులాట

- పలువురికి గాయాలు

ఖానాపురం : స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..మండలంలోని బాలుతండా త్రికూట ఆలయం సమీపంలో ఉన్న భూమి విషయంలో ధర్మరావుపేటకు చెందిన ఓ రైతు, బాలుతండా ప్రజల మధ్య కొంత కాలంగా ఘర్షణ చోటుచేసుకుంటుంది. సదరు రైతు స్థలాన్ని ఆక్రమిస్తున్నాడని తండా వాసులు అధికారులకు ఫిర్యాదులు చేయగా అధికారులు సైతం పరిశీలించారు. ఇదే సమయంలో శనివారం వివాద స్థలంలో తండాకు చెందిన క్రీడాకారులు వాలీబాల్ ఆడుతుండగా సదరు రైతు యువకులను తమ స్థలం నుంచి వెళ్లిపోవాలని కోరినట్లు తెలిసింది. ఆట ఆడుకున్నాక వెళ్తామని తెలపడంతో రైతు సమాచారంతో ధర్మరావుపేటకు చెందిన కొంత మంది స్థలం వద్దకు చేరుకొని ట్రాక్టర్‌తో వాలీబాల్‌నెట్‌ను ఢీకొట్టే క్రమంలో యువకులకు సైతం గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తండావాసులు అక్కడికి చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు తోపులాటకు పాల్పడ్డారు. ఘర్షణ పెరిగిపోతుండటంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సమస్య కాస్త తీవ్రతరం కాకముందే అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

నర్సంపేట : ప్రభుత్వ భూమిలో ఇ ళ్లు నిర్మించుకున్న పేదలకు ఇళ్ల ప ట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్ డిమాండ్ చే శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. పట్టణంలోని 601/1 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిలో నిలువ నీడలేని పేదలు ఐదేళ్లకు పైగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారన్నారు. వారికి తక్షణమే పట్టాలు అందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం నాయకులు గడ్డమీది బాలకృష్ణ, రాజు, సతీష్, అనిల్, ఎండీ ఫరీదా, వజ్జంతి, విజయఉన్నారు.

పరామర్శ



సంగెం : మండలంలోని పలు గ్రామాల్లోని బాధిత కుటుంబాలను మాజీ ఎ మ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. నర్సానగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కుమారస్వామి తల్లి ఐలమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని అలాగే వీఆర్ఎస్ తండాలో ఆత్మహత్యకు పాల్పడిన వెంకట్రాం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. పల్లారుగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బాలాజీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించారు. ఆయన వెంట వెంకటేశ్వర్‌రావు, సారంగపాణి, సుదర్శన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, ఉన్నారు.

నాన్న చదివించాడు.. ప్రయోజకులను చేశాడు


తండ్రి సమ్మయ్యతో కుమారులు

పర్వతగిరి: మండల కేంద్రానికి చెందిన పాక సమ్మయ్యకు నలుగురు కుమారులు, కుమార్తె ఉంది. పెద్ద కుమారుడు సారంగపాణి లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తె లక్ష్మిని రైల్వే ఉద్యోగికి ఇచ్చి వివాహం జరిపించారు. రెండో కుమారుడు రమేష్‌బాబు పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. మూడో కుమారుడు శ్రీనివాస్, నాల్గో కుమారుడు ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్నారు. సమ్మయ్య బెస్త కుటుంబానికి చెందినప్పటికీ తన పిలను మత్స్యకార వృత్తివైపు మళ్లించకుండా ప్రభుత్వ ఉద్యోగాలే ధ్యేయంగా అందరికి పీజీ విద్య అందించి ఉన్నతంగా తీర్చిదిద్దారు. దీంతో నాన్న ప్రోత్సాహంతో పిల్లలు సైతం ఉన్నతంగా చదువుకొని ఉద్యోగాలు సాధించి తండ్రి కృషితో ఎదిగారు.

పిల్లల ఉన్నతి కోసం శ్రమించా



తన పిల్లల ఉన్నతి కోసం శ్రమించా. వారికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడానికి నిత్యం కృషి చేశాను. 30 ఏళ్ల క్రితం భార్య చనిపోయినా రెండో వివాహం చేసుకోలేదు. తన పిల్లలు ఇప్పుడు చిన్న పిల్లాడిలా చూసుకుంటున్నారు.

– పాక సమ్మయ్య, తండ్రి

ఇలాంటి తండ్రి దొరకడం అదృష్టం



తన లాంటి తండ్రి దొరకడం చాలా సంతోషంగా ఉంది. తల్లి మృతి చెందినా చిన్ననాటి తమల్ని ఉన్నత చదువుల కోసం నిత్యం కృషి చేశాడు. ఎన్నో కష్టాలకు ఓర్చుకొని విద్యాభ్యాసం చేయించాడు. తండ్రి కృషిని చూస్తూ చదివి ఉద్యోగాలు సాధించాం.

– రమేష్‌బాబు, కుమారుడు

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన అందించారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మాది పేదల ప్రభుత్వం ఏ ఒక్క పేదవాడికి అన్యాయం జరగదని ఆయన అన్నారు. విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. మొదటి విడతలో ఇల్లు మంజూరైన వారు తక్షణమే నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్మాణ దశలను బట్టి బిల్లులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన మాంటిస్సోరి హైస్కూల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట కోర్టు ఏజీపీ బండి శివకుమార్, రామాలయ, ఆంజనేయ స్వామి ఆలయాల కమిటీ చైర్మన్‌లు కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, బెజ్జంకి వెంకటేశ్వర్లు, మాంటిస్సోరి పాఠశాల యాజ మాన్యం తాటిపర్తి అంజన్ రెడ్డి, కొత్త మధుకర్‌రెడ్డి, ఆనందరావు, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు శిరీష పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో మహిళలకు ఉపాధి

- ఎస్సై గూడ అరుణ్


మహిళలకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్సై అరుణ్

నర్సంపేట : నైపుణ్య శిక్షణలు మహిళలకు ఉపాధి మార్గాలను ఏర్పరుస్తాయని స్థానిక ఎస్సై గూడ అరుణ్ అన్నారు. శనివారం ఎఫ్ఎంఎం సాంఘిక సే వా సంస్థ వరంగల్ సహకారంతో నర్సంపేట ప్రతిభా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా మగ్గం, టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో పేదరికం నిర్మూలించడానికి, ముఖ్యంగా గృహింస, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా నిర్మూలించడానికి వారికి ఉపాధి మార్గాలు అనేవి చాలా ముఖ్యమన్నారు. ఉపాధి మార్గాలను ఎంచుకునే రీతిలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా మంచిదని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రమేష్ కోరే, సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, ఫైనాన్స్ మేనేజర్ అజయ్ కుమార్, సంస్థ యూత్ అంబాసిడర్స్ దోమ మధుమతి, దేవిక, అమర్‌నాథ్, ప్రతిభ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, స్వయం కృషి సేవాసంస్థ కార్యదర్శి బెజ్జంకి ప్రభాకర్, ట్రైనర్లు శ్వేత, సంధ్య పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం


సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కోర్టు జడ్జి వరూధిని

- సబ్ కోర్టు జడ్జి వరూధిని

నర్సంపేట రూరల్: రాజీమార్గమే రాజమార్గమని తాలుకా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్‌పర్సన్, సబ్ కోర్టు జడ్జి వరూధిని అన్నారు. నర్సంపేట కోర్టులో శనివారం లోక్‌అదాలత్ నిర్వహిచారు. ఈసందర్భంగా జడ్జి వరూధిని మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 42 క్రిమినల్ కేసులు, 4 ఎక్సైజ్ కేసుల్లో రూ.20 వేల జరిమానా విధించారు. 15 బ్యాంకు పీఎల్‌సీ కేసుల్లో రూ.6,69,086 సెటిల్‌మెంట్ అయ్యారని, 3,288 ఎస్‌టీసీ కేసుల్లో రూ.8,43,050 జరిమానా చెల్లించారని తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి చంద్రపన్న, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మీనారాయణ, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడిదెల సంజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి, లోక్‌అదాలత్ మెంబర్ మోటూరి రవి, లీగల్ సర్వీస్ అథారిటీ న్యాయవాది దొంతి సాంబయ్య, న్యాయవాదులు తండా సారంగపాణి, రహీమొద్దీన్, కొమ్ము రమేశ్ యాదవ్, పుట్టపాక రవి, అంబటి రాజ్‌కుమార్, పానుగోటి అజయ్, బొడ్డుపల్లి అజయ్, కందకట్ల వీరేశ్, పండుగ శ్రీనివాస్, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, బ్యాంకు అధికారులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా తక్షణమే అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నర్సంపేట రూరల్ : గత సీజన్‌లో రైతు భరోసా ఇవ్వని రైతులకు తక్షణమే రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎండకాలం సీజన్‌లో రైతులకు రైతు భరోసా కేవలం మూడు ఎకరాల్లోపు ఉన్న రైతులకు కొందరికి మాత్రమే రైతు భరోసా వేశారని, ఇప్పుడు వానాకాలం సీజన్ మొదలు అవుతుందని, గతంలో రైతు భరోసా ఇవ్వని రైతులకు తక్షణమే భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు భరోసా బాకీ ఉన్న రైతులకు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహారావు, మోతె జయపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్, రవి, రాంప్రసాద్, వీరన్న, కుమారస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, కర్ణాకర్, రవి, నవీన్, శ్రీకాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.